క్లుప్తంగా

దువ్వలో కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళలకు ఉచిత కుట్టుశిక్షణా కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ అడ్డా బాబు ప్రారంభించారు. దువ్వ గ్రామంలోని బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రామ వికాస కేంద్రంలో ఈ కుట్టు శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేసి గ్రామంలో మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణతో పాటు ఇతర వృత్తుల్లో శిక్షణ ఇస్తున్నట్లు బైర్రాజు ఫౌండేషన్ కన్వీనర్ శ్రీనివాసరాజు తెలిపారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దండు వెంకట కృష్ణంరాజు, జే వీ రామరాజు, ఐ రంగరాజు, సీహెచ్ సుబ్బరాజు, మహిళలు పాల్గొన్నారు.

కేసీఆర్ వ్యాఖ్యలపై ఖండన

తాడేపల్లిగూడెం (టీఓసీ): పేదరికాన్ని ఏపీలో కంటే తెలంగాణలోనే ఎక్కువ తగ్గించామని కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను పశ్చిమగోదావరి జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు చీకటిమిల్లి మంగరాజు ఖండించారు. పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఏపీలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల ఆదరణ చూరగొన్నాయన్నారు. వైఎస్ జగన్ పాలనలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ, కాపులు, అగ్ర వర్ణాలలోని పేదలకు ఎంతో మేలు జరిగిందన్నారు. వారందరూ రాబోయే 2024 ఎన్నికలలో వైఎస్సార్ సీపీకే ఓటు వేసి రెండోసారి అధికారంలోకి తీసుకురావడం ఖాయం అన్నారు. ఈ సమావేశంలో పురుషోత్తం, శ్రీను, సునీల్, సందీప్ పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధన

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. దాతలు, ప్రజలు సహాయ సహకారాలు అందజేశారు. తొలుత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి.

హౌసింగ్‌బోర్డు కాలనీలో....

దసరా మహోత్సవాలు సందర్భంగా స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలో బాల కనకదుర్గమ్మ ఆలయం వద్ద శుక్రవారం సుమారు 5 వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ వట్టి సోమేశ్వరరావు (బుజ్జి), సభ్యులు కె.సురేష్, తదితరులు పాల్గొన్నారు

కార్గో సేవలు సద్వినియోగం చేసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్టీసీ అధికారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ ఆర్టీసీ, కార్గో డెలవరీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ యేలూరి సత్య నారాయణమూర్తి తెలిపారు. డిపో నుంచి పోలీస్ ఐలాండ్ వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ పది కిలో మీటర్లు పరిధిలో 50 కేజీల బరువు వరకు బుకింగ్ చేసిన డెలివరీ పార్శిల్, కొరియర్లును ఇంటి వద్దకు తక్కువ చార్జీలతో సకాలంలో సురక్షితంగా ఇంటి వద్దకు చేర్చుతున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నేడు ప్రత్తిపాడులో గడప గడపకు మన కార్యక్రమం

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు పీర్ల గోవింద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతనిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

అర్బన్ మార్కెట్లతో మహిళలకు ఆర్థిక స్వావలంబన

మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్



మెప్మా అర్బన్ మార్కెట్‌లో పిండి వంటలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అర్బన్ మార్కెట్‌లో డ్వాక్రా మహిళలకు ఆర్థిక స్వాలంబనను చేకూరుస్తున్నాయని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్ తెలిపారు. స్థానిక బలుసులమ్మ దేవస్థానం సమీపంలో శుక్రవారం మెప్మా అర్బన్ మార్కెట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ మార్కెట్‌ను మున్సిపల్ కమిషనర్ లాంచనంగా ప్రారంభించారు. మార్కెట్‌లో ఏర్పాటు చేసిన వివిధ రకాల వంట సామాగ్రిని, సుగంధ ద్రవ్యాలను రుచి చూసి పరిశీలించారు. పిండివంటలు, పరిశుభ్రతకు వినియోగించే ఫినాయిలు, బట్టలు ఉతడానికి ఉపయోగించే సోపాయిల్‌ను 3వవార్డుకు చెందిన నాగచైతన్య డ్వాక్రా గ్రూపు సభ్యులు స్వయంగా తయారు చేసి విక్రయిచడం అభినందనీయమన్నారు. మార్కెట్‌లో కంపెనీల ముద్రలతో వినియోగిస్తున్న వస్తువుల కన్నా డ్వాక్రా సంఘాల సభ్యులు తయారు చేసిన వస్తువులు, ఇంటి అవసరాల సామాగ్రి నాణ్యతగా ఉన్నాయన్నారు. మార్కెట్ రేట్ల కన్నా తక్కువ ధరలు నాణ్యమైన వస్తువులను వినియోగించుకోవడం ద్వారా ప్రజలు ఆర్థికంగా లాభపడతారన్నారు. 23వవార్డుకు చెందిన నిర్మల్ గ్రూపు సభ్యులు సుగంధ ద్రవ్యాలు, 9వ వార్డుకు చెందిన కరుణ గ్రూపు సభ్యులు స్వయంగా తయారు చేసిన పచ్చళ్ళు , 4వవార్డు శ్రీలక్ష్మీ గ్రూపు సభ్యులు జీడిపప్పు, 32వవార్డు నాగజ్యోతి గ్రూపు రాజస్థాన్ గాజులు, మోడ్రన్ డ్రెస్సులు, 14వవార్డు ప్రభ గ్రూప్ సభ్యులు పేపర్ బెత్తంతో తయారుచేసిన బుట్టలు, 3వవార్డు నాగచైతన్య గ్రూపు సభ్యులు ఫినాయల్, సోపాయిల్ ప్రజల వినియోగార్థం తక్కువ ధరలకు విక్రయించేందుకు పలు రకాల విస్తువులను ఏర్పాటు చేశారు. డ్వాక్రా గ్రూపు సభ్యులు తయారు చేసిన తినుబండారాలు, పచ్చళ్ల, తేనీరు తదతర వస్తువులను రుచి చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మెప్మా సీఓ శ్రీకాంత్, సిటీ మిషన్ మేనేజర్ శ్రీనివాస్‌లు మాట్లాడతూ మెప్మా అర్బన్ మార్కెట్‌లను నెలకు ఒకరోజు పట్టణంలోని వేరువేరు ప్రాంతాల్లో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రిచే పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు

అత్తిలి: మండలంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను శనివారం రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రారంభించనున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. మధ్యాహ్నం 3గంటలకు అత్తిలి మండలం కె సముద్రపుగట్టు గ్రామంలో జగనన్న ఇళ్ల పట్టాలను మంత్రి పంపిణీ చేస్తారని, అనంతరం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం 4గంటలకు బల్లిపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ భవనాలు, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్‌సెంటర్ భవనాలను మంత్రి ప్రారంభిస్తారని చెప్పారు. ఈకార్యక్రమాలలో జడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

కార్పొరేట్ వైద్యం జగనన్నకే సాధ్యం



పైడిపర్రులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మందులను అందజేస్తున్న నాయకులు

తణుకు టౌన్ : పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందని పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మంగెన సూర్య చెప్పారు. శుక్రవారం తణుకు పట్టణ పరిదిలోని పైడిపర్రు, వెంకట్రాయపురం ప్రాంతాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ప్రజలకు అవసరమైన ఖరీదైన వైద్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల ముందుకు తీసుకొచ్చారని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష పథకం గురించి వివరించారు. ఈశిబిరాల్లో మొత్తం 1520 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు బీ దుర్గా మహేశ్వరరావు తెలిపారు. వీరిలో 21 మందిని రిఫరల్ ఆస్పత్రులకు రిఫర్ చేసినట్లు తెలిపారు. మరో 5గురికి టెలిమెడిసిన్ పద్దతిలో వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. ఈశిబిరంలో ఎక్కువగా కంటి వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఈశిబిరం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార పదార్థాల తయారీపై ప్రదర్శనను పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ మారిశెట్టి శివశంకర్, నాయకులు గుబ్బల సూర్యచంద్రరావు, రేలంగి రాంబాబు, శ్రీనివాసు, వైద్యులు, వైద్య సిబ్బంది, సిచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం



పడాల మార్కెట్ యార్డు ఆవరణలో ధాన్యం ఆరబెట్టిన రైతులతో మాట్లాడుతున్న ఏవో ప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో 25 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, అవి కొనుగోలుకు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పడాల, వెంకట్రామన్నగూడెం, పెదతాడేపల్లి, కడకట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌బీకే కేంద్రాల్లో ధాన్యం కొనుగోలుకు అవసరమైన పరికరాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులు గోనె సంచుల కోసం ఆర్‌బీకే ఇన్‌ఛార్జ్, వీఆర్వోని సంప్రదించాలన్నారు. ప్రతి రైతు తమ ధాన్యాన్ని ఆర్‌బీకేల్లో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ఇతర వివరాలకు తహసీల్దార్ లేదా మండల వ్యవసాయాధికారిని సంప్రదించాలన్నారు.

కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

పెంటపాడు: మండలంలోని అన్ని ఆర్బీకే సెంటర్లలో సార్వాసీజన్‌కు సంబంధించి ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె. పార్థసారధి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడారు. రైతులకు పలు సూచనలు చేశారు. పెంటపాడు మండలంలో సార్వా సీజన్‌కు సంబంధించి 21,034 ఎకరాలలో పంట సాగు చేసారన్నారు. ఈపంట నమోదు, ఈకేవైసీ, సామాజిక ముసాయిదా జాబితాను ప్రతి రైతుబరోసా కేంద్రం వద్ద ప్రచురించినట్లు తెలిపారు. దీనిపై ఉన్న అభ్యంతరాలను కూడా సరిచేస్తామన్నారు. మండలంలో 17 చోట్ల ఆర్బీకే సెంటర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయన్నారు.

మండలంలో 20 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

అత్తిలి: మండలంలో 20 రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేసామని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ శుక్రవారం చెప్పారు. రైతులు రైతు భరోసా కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించి తమ ధాన్యానికి మద్దతు ధర పొందాలన్నారు. ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రతి కొనుగోలు కేంద్రంలో టీఏ, డీఈఓ, హెల్పర్ అందుబాటులో ఉంటారని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో 300 గోనె సంచులు ముందస్తుగానే ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రామస్థాయిలో రైతులకు ఏవిధమైన సందేహాలు ఉంటే ఆర్‌బీకే ఇన్‌చార్జ్, వీఆర్వోని, మండలస్థాయిలో వ్యవసాయశాఖ అధికారి, తహసీల్దార్‌ను సంప్రదించాలన్నారు.

గ్రామాల్లో ప్రజారక్షణ భేరి జిల్లా జీపు యాత్ర



ప్రజారక్షణ భేరి జీపు యాత్రలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బాబూరావు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఇటుకుల గుంట, అమ్మృతపురం, లింగారెడ్డిగూడెం, దండగర్ర, జగన్నాథపురం, నవాబుపాలెం గ్రామాల్లో ప్రజారక్షణ భేరి జిల్లా జీపు యాత్ర శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల కష్టాలను గాలికొదిలి భారాలు మోపుతుందని దుయ్యబట్టారు. మరో పక్క రాష్ట్ర ప్రభుత్వం పన్నులు, కరెంటు చార్జీల భారీలు విపరీతంగా పెంచుతూ ఉద్యమాలపై తీవ్ర నిర్బంధాలను ప్రయోగిస్తుందన్నారు. ఈ క్రమంలో ప్రజల్ని మేల్కొలిపి అండగా నిలిచేందుకు సీపీఎం రాష్ట్ర, జిల్లా రక్షణ భేరి యాత్రను నిర్వహిస్తుందన్నారు. ఈ నెల 15వ తేదిన విజయవాడలో బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రదర్శన, సభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకుడు కండెల్లి సోమరాజు, సీపీఎం నాయకులు పీలా గాదినాయుడు, ఎస్.వెంకటేశ్వరరావు, ప్రజానాట్యమండలి గాయకులు పోతు శ్రీనివాస్, పి.నాగేంద్ర, తోట శ్రీను, శివగణేష్, తదితరులు కే.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ రాష్ట్ర పోటీల్లో ప్రతిభ

తణుకు టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాస్కెట్‌బాల్ అండర్ -19 రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల విద్యార్థినులు తమ ప్రతిభను చాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో కళాశాల విద్యార్థినులు ఎల్.పావని, ఎస్ఎం గాయత్రీ ఆడిన జట్టు రాష్ట్ర స్థాయిలో ద్వితీయస్థానం సాధించిందని ప్రిన్సిపాల్ భూపతిరాజు హిమబిందు శుక్రవారం తెలిపారు. విద్యార్థినులను, పీడీలు ఎం. శ్రీనివాసరావు, ఎం.రత్నకుమారిలను కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి అభినందించారు.

లయన్స్ సేవలు అమోఘం



విద్యార్థికి విద్యా సంకల్పం కిట్‌ను అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పేదలను ఆదుకోవడానికి లయన్స్‌క్లబ్ ఎప్పుడూ ముందువరసలో ఉంటుందని క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజులు పేర్కొన్నారు. లయన్స్ జిల్లా గవర్నర్ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో తణుకు మండలం ఉండ్రాజవరంకు చెందిన నిరుపేద విద్యార్థికి వినికిడి యంత్రం రిపేర్లు నిమిత్తం జిల్లా లయన్స్‌క్లబ్ సభ్యుల సహాయ సహకారాలతో రూ 50 వేలు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం, డైమండ్స్, స్పిరిట్ క్లబ్‌లు సభ్యులు కొప్పిశెట్టి రమణయ్య, మహమ్మద్ అహ్మద్, చిన్నం జగదీష్, పాండురంగారావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తణుకు చేరిన వెంకటేశ్వర వైభవ యాత్ర



తణుకులో వెంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాన్ని తీసుకువస్తున్న భక్తులు

తణుకు అర్బన్: యాదాద్రి వెంకన్న స్వామి తిరుమల నుంచి వెంకటేశ్వర వైభవయాత్ర పేరుతో నిర్వహిస్తున్న రథయాత్ర శుక్రవారం సాయంత్రం తణుకు చేరుకుంది. స్థానిక వాసవి క్లబ్ రాయల్స్, వాసవి వనిత క్లబ్ ప్రతినిధులు స్వామివారి రథానికి సాంప్రదాయ పద్దతిలో స్వాగతం పలికారు. తణుకు పట్టణంలోకి ప్రవేశించిన సమయం నుంచి రథంతో పాటు క్లబ్ మహిళలు కోలాట భజన చేస్తూ శ్రీవారి సంకీర్తన చేశారు. సెప్టెంబరు 25వ తేదీన తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి ప్రారంభించిన ఈ రథ యాత్ర ఆంధ్రప్రదేశ్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయాలన్నింటికీ వెళ్తూ 100 రోజుల యాత్రలో భాగంగా తిరిగి తిరుపతి చేరుకుంటుందని, వెంకటేశ్వర స్వామి ఆలయాలన్నిటినీ అనుసంధానం చేస్తూ ఒకే తాటిపైకి తీసుకురావడమే తమ ధ్యేయమని రథయాత్ర నిర్వాహకులు వివరించారు. పారిశ్రామికవేత్త గమిని రాజా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ, అఖిలభారత బ్రాహ్మణ యువత ఉపాధ్యక్షుడు సూరంపూడి కామేష్, సృష్టి సుబ్బారావు, వాసవి క్లబ్ రాయల్స్ అధ్యక్షుడు జవ్వాది వీరభద్రయ్య, కోశాధికారి కట్టమూరి మురళి, క్లబ్ వ్యవస్థాపకులు జల్లూరి జగదీష్, వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు ఆకుల వీరకుమారి, కోశాధికారి జల్లూరి సుజాత, పీఆర్వో పాబోలు కృష్ణ, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

అపరిశుభ్ర వాతావరణంపై ప్రజలకు అవగాహన కల్పించాలి



తాడేపల్లిగూడెం మండలం అప్పారావుపేట గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: అపరిశుభ్ర వాతావరణం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం మండలంలోని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి అప్పారావుపేట గ్రామంలో ఫ్రైడే డ్రైడే, వెక్టార్ కంట్రోల్, హైజీన్, దోమల ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమల లార్వాలను గుర్తించడంలో ప్రజల్ని చైతన్యవంతులను చేయాలన్నారు. డ్రైడే పాటించడం ద్వారా దోమలను అరికట్టవచ్చన్నారు. అనారోగ్య సమస్యలుంటే గ్రామాల్లోని వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, గ్రామ ఆరోగ్య కార్యదర్శి బేబి, ఆరోగ్య సహాయకులు బాబ్జీ, ఇ.కాంతారావు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల విద్యార్థినులు శ్రద్ధ వహించాలి



విద్యార్థినులకు వైద్యపరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

పెంటపాడు: యుక్తవయస్సు ప్రారంభంలో విద్యార్థినులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పెంటపాడు ఆరోగ్యకేంద్రం కమ్యూనిటీ హెల్త్ అధికారి పి. ఏసు జ్యోతి ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల విద్యార్థినులకు ఆరోగ్యపరీక్షలు, రక్తశాతం పరీక్షలు, తీసుకోవాల్సిన ఆహారం తదితర విషయాలపై అవగాహన నిర్వహించారు. కళాశాల మహిళాసాధికారత విభాగ రెడ్‌రిబ్బన్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఉమన్స్ కన్వీనర్ జయంతి కుమారి తదితరులు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అధ్యాపకులు గంధం వాణి, వి. కుసుమకుమారి, ఎన్‌సీసీ అధికారి ప్రేమ్ సాగర్, రచయిత సుంకరగోపాల్, ఎన్ఎస్ఎస్ అధికారిపాల్గొన్నారు.

సంచారజీవికి గాయాలు

ఆకివీడు: మచిలీపట్నం నుంచి స్థానిక దుంపగడప రోడ్డులోని వినాయక గుడి ప్రాంతంలో నివశిస్తున్న సంచార జాతులకు చెందిన సీలం రంగమ్మను గురువారం రాత్రి ఆటో ఢీకొనడంతో తీవ్ర గాయాలైనట్లు ఎస్సైనాగబాబు శుక్రవారం చెప్పారు. నడిచి వెళ్లతున్న ఆమెను వెనుక నుంచి అతి వేగంగా, నిర్లక్ష్యంగా ఏపీ 37 టీడీ 6224 నెంబర్ ఉన్న ఢీకొట్టిందని తెలిపారు.